# బాధపడొద్దు.. ధైర్యంగా ఉండాలి

- బీఆర్ఎస్ కార్యకర్తలకు హరీశ్‌రావు భరోసా
- సందడిగా క్యాంప్ కార్యాలయం
- ఏడోసారి సిద్దిపేట నుంచి విజయం సాధించడంపై హర్షం

సిద్దిపేట, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయం గురువారం బీఆర్ఎస్ కార్యకర్తలు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలతో సందడిగా మారింది. ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి సిద్దిపేటకు వచ్చిన హరీశ్‌రావును పార్టీ కార్యకర్తలు కలిశారు. పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. తనను కలవడానికి వచ్చిన ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఎవ్వరూ బాధ పడవద్దు.. ధైర్యంగా ఉండాలంటూ వారికి భరోసానిచ్చారు. నంగునూరు, చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, రూరల్, సిద్దిపేట మున్సిపాలిటీ, నారాయణరావుపేట మండలాలతోపాటు గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. దివ్యాంగులు, ఆటో రిక్షా కార్మికులు, ఇతర వర్గాల వారు హరీశ్‌రావును కలిశారు. సెల్ఫీలు తీసుకొని సంబురపడ్డారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్ల వివరాలను హరీశ్‌రావుకు విన్నవించారు. వరుసగా సిద్దిపేట నుంచి ఏడోసారి విజయం సాధించడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 82,308 ఓట్ల భారీ మెజార్టీతో హరీశ్‌రావు ఘన విజయం సాధించారు. పైగా వరుసగా ఏడోసారి ఒకే నియోజకవర్గం నుంచి గెలుపొంది రికార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తొలిసారిగా 2004 అక్టోబర్‌లో మొదటిసారిగా సిద్దిపేట శాసన సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో హరీశ్‌రావు పోటీ చేసి 24,827 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి విజయాలతో దూసుకెళ్తున్నారు. తర్వాత ప్రతీ ఎన్నికలో తన మెజార్టీని తానే అధిగమిస్తూ ప్రత్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తూ తిరుగులేని నేతగా ఎదిగారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలో 58,935 ఓట్ల మెజార్టీ, 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీ, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఓట్ల మెజార్టీ, 2014లో 93,328 ఓట్ల మెజార్టీ, 2018 సార్వత్రిక ఎన్నికల్లో 1,18,699 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసిన నేతకు ప్రజలు పట్టం కడుతూ వస్తున్నారు.

## కోలాహలంగా క్యాంపు కార్యాలయం



అభివాదం చేస్తూ అందరినీ పలుకరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, డిసెంబర్ 7: సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సిద్దిపేట క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు గురువారం ప్రజాప్రతినిధులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో క్యాంపు కార్యాలయం ఎటు చూసినా కోలాహలంగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ధ్రువీకరణ పత్రం అందుకున్న ఎమ్మెల్యే



సిద్దిపేట కమాన్, డిసెంబర్ 7: సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన తన్నీరు హరీశ్‌రావుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్ అందించారు. ఇటీవల రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు చేతుల మీదుగా ఎన్నిక సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు పక్షాన బీఆర్ఎస్ ఎన్నికల ఏజెంట్ మోహన్‌లాల్ అందుకోగా.. గురువారం సిద్దిపేటలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు అందించారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

సిద్దిపేట, డిసెంబర్ 7: సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ కాపాడుకుంటుందని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2017 నుంచి 2023 వరకు సభ్యత్వం పొందిన వారిలో 60 మందికి ఇన్సూరెన్స్ ద్వారా రూ.2 లక్షల చొప్పున చెక్కులు ఇచ్చినట్లు తెలిపారు. చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన మెట్ల పరశురాములు ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన పొన్నాల మల్లేశం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వీరికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండి కార్యకర్తగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ ఇన్సూరెన్స్ నుంచి రూ.2 లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

## భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 7: పటాన్‌చెరు పట్టణంలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే దంపతులు ధ్వజ స్తంభం, సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సొంత నిధులు ఖర్చు చేసి అనేక ఆలయాలు నిర్మిస్తున్నామన్నారు. పాత ఆలయాలను ఆధునీకరించి సౌకర్యాలు కల్పించామన్నారు. భగవంతుడి అనుగ్రహం, ప్రజల ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. అనంతరం బచ్చుగూడెంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సఫానదేవ్, గ్రామ సర్పంచ్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 7: మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకాంక్షించారు. గురువారం మండలపరిధిలోని మిట్టపల్లిలో మహిళలతో నడుస్తున్న పప్పులు, పసుపు, కారం యూనిట్లను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ మేరకు వారు చేస్తున్న వ్యాపారం, అమ్మకాలు, కొనుగోలు, లాభ నష్టాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా అమ్మకాలు చేపట్టేందుకు కావాల్సిన నైపుణ్యాలను, నాణ్యతాప్రమాణాల గురించి నిర్వాహకులతో చర్చించారు. మిట్టపల్లి మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.

# ఇద్దరికి అమాత్యయోగం

- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం
- సంగారెడ్డి జిల్లా నుంచి దామోదర రాజనర్సింహ
- సిద్దిపేట జిల్లా నుంచి పొన్నం ప్రభాకర్
- ప్రజా సమస్యలపై దృష్టి సారించాలంటున్న జనం



దామోదర రాజనర్సింహ



పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, డిసెంబర్ 7( నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ గురువారం ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం నుంచి దామోదర రాజనర్సింహ గెలుపొందారు. ఆయన బీఈ (సివిల్) చదివారు. కాంగ్రెస్‌లో వివిధ పదవులు చేపట్టారు. అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేసిన అనుభవం ఉంది. తొలిసారిగా 1989లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో రెండోసారి గెలుపొంది, 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో మూడోసారి విజయం సాధించి వైఎస్ఆర్, రోశయ్య మంత్రి వర్గంలో పనిచేశారు. 2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం దామోదర రాజనర్సింహకు వైద్యం, ఆరోగ్య శాఖను కేటాయించారు.

### పొన్నంకు బీసీ సంక్షేమ శాఖ

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గెలుపొందారు. ఆయన బీఏ ఎల్ఎల్‌బీ చదివారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు. తొలిసారి కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంక్షేమ శాఖను కేటాయించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకునే బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు సంపాదించుకున్న ఇద్దరు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లపై మరింత గురుతర బాధ్యత ఉంది. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ, యాసంగి సాగు ముమ్మరం అయిన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. ప్రధానంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు కృషి చేయాలని కోరుతున్నారు.

# వంటిమామిడి ఏఎంసీ పాలకవర్గం రాజీనామా

ములుగు, డిసెంబర్ 7: మండలపరిధిలోని వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పాలకవర్గ సభ్యులు తమ పదవులకు గురువారం రాజీనామా సమర్పించారు. ఇటీవల వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోకపోవడంతో ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఎంసీ చైర్మన్ జహంగీర్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సైతం తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. 2014లో కేసీఆర్ వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా ఉద్యమనేత, కేసీఆర్ బాల్యమిత్రుడైన మహ్మద్ జహంగీర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జహంగీర్ కోరిక మేరకు 2021లో అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ అభివృద్ధి, రైతులకు మద్దతు ధర లభించేందుకు అవసరమైన ప్రణాళికలను అధికారులతో కలిసి రూపొందించారు. మార్కెట్‌ను వెజిటబుల్ హబ్‌గా రూపొందించేందుకు, కూరగాయల నిల్వలకు కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు రూ.100కోట్లు మంజూరు చేశారు. మార్కెట్ విస్తరణకు 75 ఎకరాలు సేకరించగా విస్తరణ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఏఎంసీ డైరెక్టర్లు ఏనుగు బాపురెడ్డి, రాందాస్‌గౌడ్, నిమ్మకాయల గణేశ్, తిరుపతి నాయక్, బాలయ్య ఉన్నారు.

### అధికారంలో లేకున్నా సేవలందిస్తాం

అధికారులకు తన రాజీనామా పత్రాన్ని అందిజేసిన తర్వాత ఏఎంసీ చైర్మన్ జహంగీర్ మాట్లాడారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో సముచిత మార్పులు చేశామన్నారు. రైతులకు మద్దతు ధర వచ్చేలా, కమీషన్ ఏజెంట్లు అతితక్కువ కమీషన్ మాత్రమే వసూలు చేసేలా అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. వ్యాపారస్తులు, అధికారుల సహకారంతో రైతులకు ఎన్నో సేవలు అందించామని, అధికారంలో లేకపోయినా రైతులకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ జహంగీర్